క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన



చాట్రాయి: పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు ఉన్నాయని తహసీల్దార్ మహ్మద్ మసూద్ అలీ అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆయన మాట్లాడారు. ఆయా గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల ఏర్పాటులో ఎలాంటి మార్పులు లేవని. అన్ని పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, టాయిలెట్స్ సౌకర్యాలు ఉన్నాయని చెప్పారు. ఓటర్లు ఓటు వేసేందుకు అన్ని బూత్‌లు సౌకర్యంగా ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మంగా కుమారి, ఏఎస్ఐ గజపతి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ



మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు కృష్ణా యూనివర్సిటీ డిగ్రీ మొదటి, మూడవ సెమిస్టర్‌లో ప్రతిభ కనబర్చి ఉత్తమ ఫలితాలు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి బుధవారం తెలిపారు. వృక్ష శాస్త్రంలో ఎం. అనుపమ 99 మార్కులు, మ్యాథ్స్‌లో పి. ఉష 100, పి. చారి 99, బి. రాజశ్రీ 100, జె. ప్రశాంతి 100, పి. జాహ్నవి 98, చరిత్రలో ఎ. పావని 99, టి. రవి 99, వి. స్పందన 96 మార్కులు సాధించారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవి, వైస్ ప్రిన్సిపాల్ పి. రంగారావు, అధ్యాపకులు డాక్టర్ జె. రాముడు, డాక్టర్ ఎం. దేవానంద్‌కుమార్ అభినందించారు.

గజలక్ష్మీ దేవికి వెండి కిరీటం సమర్పణ



మెట్టగుట్ట(గంపలగూడెం): గంపలగూడెం మండలం పెనుగొలను శివారు మెట్టగుట్టపై విరాజిల్లుతున్న శేషాచల శ్రీనివాస స్వామి ఆలయంలో గజలక్ష్మి అమ్మవారికి భక్తుడు రూ. 70 వేల విలువ చేసే వెండి కిరీటాన్ని బుధవారం సమర్పించారు. పెనుగొలనుకు చెందిన నాళ్ల వెంకట మోహన్‌రావు, నాగమణి దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి అలంకరణ కోసం వెండి కిరీటాన్ని తయారు చేయించారు. ఈ కిరీటాన్ని ఆలయ కమిటీ చైర్మన్ జొన్నల ప్రతాప్‌రెడ్డికి అందజేశారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేసి కిరీటాన్ని అమ్మవారికి అలంకరించారు. దాత కుటుంబీకులను అర్చకులు ఆశీర్వదించారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ బడ్జెట్ సమావేశం

నూజివీడు: నూజివీడు పురపాలక సంఘం బడ్జెట్‌పై గురువారం పాలకవర్గ సమావేశం నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశంలో కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొనాలని కమిషనర్ కోరారు.

6 వేల మందికి టీకాలు

తిరువూరు: మండలంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం చిన్నారులకు, గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఐదేళ్లలోపు పిల్లలకు కంఠసర్పి, కోరింత దగ్గు, పోలియో, మెదడువాపు, నిమోనియా, తట్టు వ్యాధులు రాకుండా వార్డు సచివాలయాల్లోని ఆరోగ్య కార్యదర్శులు, ఆశా వర్కర్లు ఈ టీకాలు వేశారు. అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి భాను మనోజ్, సూపర్‌వైజర్లు పర్యవేక్షించారు.

బూత్ కమిటీలు బలోపేతం కావాలి

తిరువూరు: రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపునకు బూత్ కమిటీలు కీలక పాత్ర పోషించాలని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి అన్నారు. తిరువూరు పట్టణంలోని 5, 17 వార్డులలో బూత్ కమిటీల సమావేశం బుధవారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఓటూ కీలకమేనని, పోలింగ్ ముగిసే వరకు ప్రతి ఓటరుతో బూత్ కమిటీ సభ్యులు సమన్వయంతో వ్యవహరించాలని కోరారు. పార్టీ నాయకులు షేక్ రఫీ, పరసా శ్రీనివాసరావు, జాకీర్, ముత్తారావు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు, కారు ఢీ

మైలవరం: ఎదురెదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు, కారు బుధవారం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. విజయవాడ నుంచి వస్తున్న 218 ఆర్టీసీ బస్, మైలవరం నుంచి నూజివీడు వైపునకు వెళుతున్న కారు మైలవరం మండలం వెల్వడం గ్రామం గణపవరం అడ్డ రోడ్డు వద్ద ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వాహనాల్లో ప్రయాణిస్తున్న వారికి ఎటువంటి గాయాలు కాలేదు. ప్రమాదంలో కారు ముందు భాగం ధ్వంసమైంది.

పల్లెలకు రాచబాట

- రూ.3.63 కోట్లతో బోర్వంచ- యనమదల రోడ్డు నిర్మాణం
- ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు కృషితో సమకూరిన రహదారి
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు, రైతులు



నిర్మించిన తారురోడ్డు

నూజివీడు: మండలంలోని బోర్వంచ నుంచి నెహ్రూనగర్, రేగుంటల మీదుగా యనమదల వరకు సుమారు 6 కిలోమీటర్ల మేర తారురోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజల చిరకాల కోరిక ఎట్టకేలకు నెరవేరింది. అంతేకాక 1,000 ఎకరాలకు పైగా వ్యవసాయ భూములకు సంబంధించిన రైతులకు రోడ్డు నిర్మాణం వరం అని చెప్పడంలో అతిశయోక్తి లేదు. ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కృషితో పీఎంజీఎస్‌వై కింద రూ.3.63 కోట్లు మంజూరు కాగా, ఆ నిధులతో తారు రోడ్డు నిర్మాణ పనులను చేపట్టారు. బోర్వంచ నుంచి అమృతనగర్, రేగుంట మీదుగా యనమదల వరకు ఈ రోడ్డు నిర్మాణం జరుగుతోంది. చాలా కాలంగా రహదారిని నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నప్పటికీ గతంలో పాలించిన ప్రభుత్వాలు ఇవేమీ పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి ప్రతిపాదనలు పంపించి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా కృషి చేశారు. పంచాయతీరాజ్ అధికారులు రోడ్డు నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్నారు. లింకురోడ్ల నిర్మాణం వల్ల గ్రామాలు సైతం అభివృద్ధి పథంలో పయనించనున్నాయి.

వ్యవసాయ ఉత్పత్తుల తరలింపునకు మార్గం సుగమం

ఈ రహదారి నిర్మాణం వల్ల వందలాది ఎకరాల భూముల్లోని వ్యవసాయ ఉత్పత్తులను సులువుగా తరలించేందుకు మార్గం సుగమమైంది. రేగుంట, కొన్నంగుంట, కొత్తూరు, అమృతనగర్, యనమదల గ్రామాలకు చెందిన రైతులకు వందలాది ఎకరాల వ్యవసాయ భూములున్నాయి. తారు రోడ్డు నిర్మాణంతో మామిడి, మొక్కజొన్న, పత్తి, కూరగాయలు, ఇతర వ్యవసాయ, ఉద్యాన పంటల దిగుబడులను రైతులు ఇళ్లకు చేర్చుకునేందుకు ఇబ్బందులు తొలగినట్లయింది. అంతేకాక ఈ రోడ్డు నిర్మాణం వల్ల రానున్న రోజుల్లో వ్యవసాయ భూముల ధరలు కూడా పెరుగుతాయని ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే వల్లే సాధ్యమైంది



ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కృషి వల్లే ఈ రోడ్డు నిర్మాణం సాధ్యమైంది. బోర్వంచ నుంచి యనమదల వరకు తారు రోడ్డు నిర్మాణం ఈ ప్రాంత ప్రజలకు వరం. మామిడి కాయలు తోటల్లో నుంచి తెచ్చుకునేందుకు ఎంతో సులువవుతోంది. బోర్వంచ, అమృతనగర్, రేగుంట, యనమదల గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు చేసిన మేలును ఎన్నటికీ మరిచిపోరు.

– గుడిమళ్ల కృష్ణంరాజు, జెడ్పీ వైస్ చైర్మన్, రేగుంట

దూరాభారం తగ్గుతుంది

ఈ రోడ్డు నిర్మాణం వల్ల బోర్వంచ, కొన్నంగుంట, కొత్తూరు, రామన్నగూడెం, రావిచర్ల, కొత్తరావిచర్ల తదితర గ్రామాల ప్రజలు మైలవరం, యనమదల, బత్తులవారిగూడెం తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే దూరాభారం సైతం తగ్గుతుంది. నూజివీడు పట్టణంలోకి రాకుండానే వెళ్లవచ్చు. దీంతో పట్టణంలో కూడా ట్రాఫిక్ తగ్గుతుంది. అత్యవసర సమయాల్లో మైలవరం వైపు నుంచి వచ్చే ట్రాఫిక్‌ను ఈ రోడ్డు మార్గం ద్వారా నూజివీడు పట్టణంలోకి రాకుండా మళ్లించేందుకు వీలవుతుంది.

రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని వినతి



ఇబ్రహీంపట్నం: జి. కొండూరు–గంగినేనిపాలెం రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయించాలని జి.కొండూరు జెడ్పీటీసీ మందా జక్రధరరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్‌ను ఇబ్రహీంపట్నంలో బుధవారం కలిసి రోడ్డు సమస్య ఆయన దృష్టికి తెచ్చారు. గుంతలమయంగా మారిన కేజీవై రోడ్డు వలన సుమారు 10 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మంత్రి స్పందించి సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి తక్షణమే రోడ్డు పనులు ప్రారంభించాలని ఆదేశించారు. దుగ్గిరాలపాడు, గంగినేనిపాలెం, తెల్లదేవరపాడు, మునగపాడు సర్పంచులు జడ రాంబాబు, పిల్లి రామారావు, ఉమ్మడి ప్రసాద్, వగడాల వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ పిల్లి ప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్ ఎ.వెంకటేశ్వరరావు, సీహెచ్ సుబ్బారావు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

తిరువూరు: రహదారి భద్రతా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని తిరువూరు ఎస్ఐ సత్యనారాయణ అన్నారు. ప్రయాణికుల ఆటోలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. డ్రైవింగ్ లైసెన్సు లేకుండా, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకునే ఆటోడ్రైవర్ల వాహనాలను సీజ్ చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు.

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



ఆగిరిపల్లిలో పీహెచ్‌సీని ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు



ఈదులగూడెంలో సచివాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెలే ప్రతాప్ అప్పారావు

ఆగిరిపల్లి: ప్రజా సంక్షేమం, అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం పర్యటించి ప్రభుత్వ భవనాలను ప్రారంభించారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. వట్టిగుడిపాడులో జల్ జీవన్ నిధులు రూ.76.80 లక్షలతో నిర్మించనున్న ఇంటింటికీ కుళాయి పథకానికి శంకుస్థాపన చేశారు. ఈదులగూడెంలో రూ.78.47 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను, జగనన్న పాల వెల్లువ కేంద్రాన్ని, గ్రామ సచివాలయాన్ని ఆయన ప్రారంభించారు. కలటూరులో రూ.16 లక్షలతో నిర్మించిన సీసీ డ్రెయినేజీలను ప్రారంభించి రూ.63.70 లక్షల నిధులతో ఇంటింటికీ కుళాయి పథకానికి శంకుస్థాపన చేశారు. ఆగిరిపల్లిలో రూ.45 లక్షల నిధులతో ఇంటింటికీ కుళాయి పథకానికి శంకుస్థాపన చేసి రూ.23.90 లక్షల నిధులతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, రూ.1.82 కోట్లతో నిర్మించిన ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒకవైపు సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందజేస్తూ మరోవైపు ప్రజలకు అవసరమైన విద్య, వైద్యం, రోడ్లు వంటి మౌలిక వసతులు కల్పిస్తున్నారని వివరించారు. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక చంద్రబాబు లేనిపోని విమర్శలు చేస్తూ ప్రజలను పక్కదోవ పట్టించేందుకు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు చెప్పే మాయమాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి ప్రజలంతా పట్టం కట్టాలని కోరారు. డీఎంహెచ్ఓ డాక్టర్ శర్మిష్ఠ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పేదవాడికి మెరుగైన వైద్యం అందించాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్నారని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాధారణ కాన్పులు చేస్తున్నామని, 64 రకాల రక్త పరీక్షలు చేయటానికి సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, డీఎస్ఓ డాక్టర్ నరేంద్ర కృష్ణ, ఎంపీపీ గోళ్ల అనూష, జెడ్పీటీసీ పిన్నిబోయిన వీరబాబు, ఎంపీడీఓ శామ్యూల్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పల్లగాని నరసింహారావు, జిల్లా కార్యదర్శి మచ్చా హరిబాబు, పెరిక కార్పొరేషన్ డైరెక్టర్ అత్తి పార్వతి, డాక్టర్ జగన్‌మోహన్‌రావు, డెప్యూటీ తహసీల్దార్ పవన్ కుమార్, నాయకులు ఈలప్రోలు సుబ్బయ్య, అత్తి మురళి, రాఘవరపు సురేష్, నందూరు భాస్కర్ ప్రసాద్, సాదం గోపి, నాగుల్ మీరా తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రామిరెడ్డిని కలిసిన తిరుపతిరావు



అయోధ్యరామిరెడ్డి, మర్రి రాజశేఖర్‌ను కలిసిన తిరుపతిరావు

మైలవరం: ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ పెద్దలు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, మర్రి రాజశేఖర్‌లను మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావు బుధవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఎంపీ నానిని కలిసిన ఇన్‌చార్జ్ తిరుపతిరావు..

ఇబ్రహీంపట్నం: విజయవాడ ఎంపీ కేశినేని నానిని వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావు, ఇబ్రహీంపట్నం వైఎస్సార్ సీపీ నాయకులు మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. నియోజకవర్గంలో గ్రామాల్లో పర్యటనలు, పార్టీ కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకు వెళ్లాలని ఎంపీ నాని సూచించారు. దుర్గగుడి కమిటీ సభ్యుడు చింకా శ్రీనివాసరావు, కొండపల్లి మున్సిపాల్టీ సచివాలయాల కో–ఆర్డినేటర్ లంకే అంకమోహనరావు, దయాకర్, పండు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ కేశినేని నానిని కలిసిన తిరుపతిరావు

దామోదరం సంజీవయ్యకు నివాళి



విస్సన్నపేటలో నివాళులర్పిస్తున్న నాయకులు

విస్సన్నపేట: తొలి దళిత ముఖ్యమంత్రి, నిస్వార్థ నాయకుడు దామోదరం సంజీవయ్య అని బహుజన దళిత ఐక్య వేదిక నాయకులు కొనియాడారు. స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో దివంగత మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బహుజన దళిత ఐక్య వేదిక నాయకులు కొండా రాజీకుమార్, ముత్తంశెట్టి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ పల్లెపాం లక్ష్మయ్య, మేకల జ్ఞానరత్నం, నాగరాజు, ముంగా జయరాజు, పి. ధనరాజు తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు: ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి కార్యక్రమం బుధవారం తిరువూరు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. రాష్ట్ర ప్రగతికి సంజీవయ్య చేసిన కృషిని ఎంపీడీఓ నాగేశ్వరరావు వివరించారు. సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈఓపీఆర్‌డీ వెంకటరత్నం, సిబ్బంది పాల్గొన్నారు.



తిరువూరు ఎంపీడీఓ కార్యాలయంలో నివాళి

భక్తిశ్రద్ధలతో దేవుని ప్రార్థించాలి



తిరువూరు ఆర్‌సీఎం చర్చిలో మండల దీక్షలు స్వీకరిస్తున్న క్రైస్తవులు



ప్రసంగిస్తున్న ఫాదర్ అనిల్ ఫ్రాన్సిస్



చనుబండ చర్చిలో ఉపవాస ప్రార్థన చేస్తున్న ఫాదర్ నరేష్

తిరువూరు: దేవుని అనుగ్రహం పొందడానికి భక్తిశ్రద్ధలతో ప్రార్థించాలని తిరువూరు ఆర్‌సీఎం చర్చి ఫాదర్ రెవరెండ్ జంగం విజయకుమార్ అన్నారు. భస్మ బుధవారం సందర్భంగా చర్చిలో 200 మంది క్రైస్తవ విశ్వాసులకు దేవుని దీక్షాధారణ కార్యక్రమం నిర్వహించారు. 40 రోజుల పాటు విశ్వాసంతో దేవుని దీక్ష కొనసాగించిన వారికి భగవదనుగ్రహం తప్పక కలుగుతుందని ఆయన అన్నారు. దీక్షాకాలంలో పాటించాల్సిన నియమాలను వివరించారు. విచారణ పరిధిలోని పలు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు దివ్యబలిపూజలో పాల్గొన్నారు. చింతలపాడు సీఎస్ఐ చర్చిలో కూడా తపస్కాల ప్రార్థనలు, మండల దీక్షా ధారణ కార్యక్రమం బుధవారం జరిగింది. తిరువూరు నియోజకవర్గ క్రిస్టియన్ కౌన్సిల్ అధ్యక్షుడు గంటా జయంత్‌బాబు వాక్యోపదేశం చేశారు. పాస్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

మైలవరంలో ప్రత్యేక ప్రార్థనలు

మైలవరం: భస్మ బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా మైలవరం ఆర్‌సీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ కె. అనిల్ ఫ్రాన్సిస్ మాట్లాడుతూ తపస్సు కాల ఉపవాస ప్రార్థనలు ప్రారంభమయ్యాయన్నారు. ప్రతి ఒక్కరూ పాపాన్ని విడిచిపెట్టి ప్రేమను కలిగి జీవించాలన్నారు. రెవరెండ్ ఫాదర్ ప్రదీప్ ప్రసంగించారు. ఈ సందర్భంగా 120 మంది విశ్వాసులు దీక్షను స్వీకరించారు. కార్యక్రమంలో మైలవరం విచారణలోని 16 సంఘాల విశ్వాసులు పాల్గొన్నారు.

ఉపవాస ప్రార్థనలు ప్రారంభం

చాట్రాయి: ఏసుక్రీస్తు శిలువపై పడిన కష్టాలను స్మరించుకుంటూ బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో క్రైస్తవులు ఉపవాస ప్రార్థనలను ప్రారంభించారు. దీక్ష తీసుకున్న క్రైస్తవులకు చర్చి ఫాదర్లు, పాస్టర్లు మెడలో జపమాల వేశారు. దీక్షాధారులు 40 రోజుల పాటు ఒక పూట ఉపవాసం చేస్తారు. చనుబండ, చాట్రాయి, కోటపాడు ఆర్‌సీఎం చర్చి ఫాదర్లు జి. నరేష్, బి.జయరాజు ఉపవాస ప్రార్థనలు చేశారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



సమావేశంలో సంజీవయ్యకు నివాళులర్పిస్తున్న ఎంపీపీ జోత్స్న, ఎంపీడీఓ అనూరాధ తదితరులు

ఇబ్రహీంపట్నం: రానున్న వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ పాలడుగు జోత్స్న గ్రామీణ తాగునీటి సరఫరా అధికారులకు సూచించారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో బుధవారం ఆమె అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ముందుగా మాజీ ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎంపీడీఓ అనూరాధతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వివిధ గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రభుత్వ శాఖల అధికారులు సమగ్ర నివేదిక చదివి వినిపించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాణావత్ నాగబాలమ్మ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

ఎల్బీఆర్సీఈ అధ్యాపకునికి పీహెచ్‌డీ ప్రదానం



మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఫ్రెష్‌మెన్ ఇంజినీరింగ్ విభాగం అధ్యాపకులు ఎన్‌టీ శర్మకు పీహెచ్‌డీ లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూల్, రాయలసీమ యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగంలో చేసిన పరిశోధనకు ఆయనకు పీహెచ్‌డీ ప్రదానం చేశారన్నారు. విజయవాడ ఆంధ్ర లయోలా కళాశాల ఆక్వా జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ సీహెచ్ శ్రీనివాస్ పర్యవేక్షణలో పరిశోధన పత్రం సమర్పించారని చెప్పారు. ఈ పరిశోధన పెయింట్స్, ప్రింటింగ్, రబ్బర్, డ్రగ్, థర్మల్ ప్రొటెక్షన్ ఫ్లూయిడ్ అప్లికేషన్స్‌లో ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం, ప్రెసిడెంట్ జి. శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు, ఫ్రెష్‌మెన్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎ. రామిరెడ్డి తదితరులు అభినందించారు.

విశ్రాంత ఉపాధ్యాయిని దయామణి మృతి



విస్సన్నపేట: మండలంలోని తెల్లదేవరపల్లి హెచ్‌డబ్ల్యూ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేసిన విశ్రాంత ఉపాధ్యాయిని మడిపల్లి దయామణి (70) అనారోగ్యంతో బుధవారం మృతిచెందారు. మృతురాలికి భర్త, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు, పలువురు ఉపాధ్యాయులు ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

చేతిరాతను మెరుగుపరచుకోవాలి

గానుగపాడు(తిరువూరు): విద్యార్థులు తమ చేతిరాతను మెరుగుపరచుకుంటే మంచి భవిష్యత్ సాధ్యమవుతుందని చేతిరాత నిపుణుడు ఎం. మధు అన్నారు. గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం చేతిరాత నైపుణ్యంపై విద్యార్థులకు ఆంగ్ల భాషోపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వోద్యోగాలకు నిర్వహించే రాత పరీక్షల్లో చేతిరాత కూడా ముఖ్య అంశమని, హైస్కూల్ స్థాయిలోనే చేతిరాతను మెరుగుపరచుకోవాలని మధు సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఆదిలక్ష్మి, ఆంగ్ల భాషోపాధ్యాయ సంఘం కన్వీనర్ రాంప్రదీప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సరస్వతి దేవికి విశేష పూజలు

ఊటుకూరు (గంపలగూడెం): వసంత పంచమి సందర్భంగా ఊటుకూరులో వాసవి, వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో బుధవారం సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు జరిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నెలకొల్పిన సరస్వతి దేవి విగ్రహానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు చేశారు. పలువురు మాట్లాడుతూ విద్య ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. విద్య ద్వారానే విద్యార్థులు విజ్ఞానాన్ని పొంది తమ జీవితాలకు బంగారు బాట వేసుకోవాలన్నారు. ఆయా క్లబ్‌ల ప్రతినిధులు కోట శ్రీనివాసరావు, వి. బాబ్జీ, వి. మురళీమోహన్, పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె. మంజుల, పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు. పెనుగొలనులో షిర్డీ సాయిబాబా సేవా సమితి ఆధ్వర్యంలో వసంత పంచమి ప్రత్యేక పూజలు జరిపారు.

రేపు సార్వత్రిక సమ్మె

నూజివీడు: దేశవ్యాప్తంగా ఈనెల 16న నిర్వహించనున్న గ్రామీణ బంద్, సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని అమర్ భవన్‌లో ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు చాట్ల పుల్లారావు, జి.రాజు విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని ధ్వజమెత్తారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎస్ఆర్ హనుమాన్ పాల్గొన్నారు.

● **రెడ్డిగూడెం:** కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న జరిగే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు కొండపల్లి పరమేశ్వరరావు కోరారు. బుధవారం కరపత్రాలను పంపిణీ చేశారు.

పశువులకు ఉచిత వైద్య పరీక్షలు

చిలుకూరువారిగూడెం (మైలవరం): గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత పశు వైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కొత్తగూడెం పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు అప్పిడి సాంబిరెడ్డి అన్నారు. మైలవరం మండలం చిలుకూరువారిగూడెంలో కృష్ణా మిల్క్ యూనియన్, విజయ డైరీ ఆధ్వర్యంలో గ్రామంలోని పాల కేంద్రం వద్ద బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 60 పాడి గేదెలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. డాక్టర్ సీహెచ్ రాజేష్ మాట్లాడుతూ పాడి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఎంఏ రెడ్డి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మైలవరం: మైలవరం ఐసీడీఎస్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సీడీపీఓ పుష్పలత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైలవరం నియోజకవర్గంలోని రెడ్డిగూడెం మండలం కూనపరాజుపర్వ (బీసీ–ఏ), ఇబ్రహీంపట్నం మండలం దొనబండ జనరల్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. స్థానికులు, వివాహితులై ఉండాలని, 35 సంవత్సరాల వయస్సులోపు వారు అర్హులన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రం, నివాస, ఆధార్ కార్డు, రేషన్ కార్డు జతపరచాలని చెప్పారు. ఇతర వివరాలకు సీడీపీఓ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.